


## ఎఫ్ఐఎఫ్ఎ ఫ్రెండ్లీ మ్యాచ్ పోస్టర్‌ను ఆవిష్కరించిన సిఎం రేవంత్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, నవంబరు 15:** ఎఫ్ఐఎఫ్ఏ ఫ్రెండ్లీ మ్యాచ్ పోస్టర్ ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో ఈ నెల 18న గచ్చిబౌలి స్టేడియంలో ఇండియా వర్సెస్ మలేషియా ఫుట్ బాల్ మ్యాచ్ జరగనుంది. పోస్టర్ ఆవిష్కరణ లో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారులు కె.కేశవరావు, వేం నరేందర్ రెడ్డి, శ్రీనివాసరాజు, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ చైర్మన్ శివ సేనారెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్, మధుయాష్కీ గౌడ్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ప్రిన్సిపల్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా కృష్ణకుమార్ ఏకగ్రీవం

### రాష్ట్ర ప్రధానకార్యదర్శిగా రవీందర్‌రెడ్డి.. మూడేళ్లపాటు కొనసాగనున్న కొత్త కార్యవర్గం

**హైదరాబాద్, నవంబరు 15, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీఎస్ ప్రిన్సిపల్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడి తిరిగి కృష్ణకుమార్ ఎన్నికయ్యారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కె రవీందర్ రెడ్డి ఎన్నికయ్యారు. శుక్రవారం జరిగిన అసోసియేషన్ ఎన్నికల్లో రాష్ట్ర ఆఫీస్‌బేరర్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు గవర్నమెంట్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు పి మధుసూదన్ రెడ్డి తెలిపారు. కొత్తగా ఎన్నికైన కార్యవర్గం మూడు సంవత్సరాల పాటు కొనసాగనుంది. 2024 నుంచి 2027 వరకు నూతన కార్యవర్గం తమ కార్యకలాపాలను నిర్వహించనుంది. రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీల బలోపేతానికి తమ వంతు కృషి చేస్తామని ప్రిన్సిపల్స్ అసోసియేషన్ అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికైన కళింగ కృష్ణ కుమార్ తెలిపారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులుగా శాగంటి శ్రీనివాస్, ఆర్ మాధవరావు ఎన్నిక కాగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కె రవీందర్ రెడ్డి, ఫైనాన్స్ సెక్రటరీగా కె లక్ష్మణ్‌రావు లేడీ సెక్రటరీగా కె రజిత ఎన్నికయ్యారు. మొత్తం 19 మంది ఆఫీస్ బేరర్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు తెలిపారు.

## గిరిజనుల అస్తిత్వం కోసం పోరాడిన బిర్సాముండా

### బిజెపి కార్యాలయంలో జయంతి వేడుక



**హైదరాబాద్, నవంబరు 15, ప్రభాతవార్త:** ఆదివాసుల అస్తిత్వం, జీవన స్థితిగతుల కోసం పోరాటం చేసిన గొప్ప నాయకుడు, గిరిజన శక్తిని ఏకీకరణ చేసి బ్రిటిష్ అకృత్యాలకు వ్యతిరేకంగా మహా ఉద్యమాన్ని నడిపిన గిరిజన స్వాతంత్ర్య సమరయోధుడు బిర్సా ముండా అని బిజెపి నేతలు అన్నారు. శుక్ర వారం బిర్సా ముండా జయంతి సందర్భంగా బిజెపి రాష్ట్ర కార్యాల యంలో ఎస్టీ మోర్చా ఆధ్వర్యంలో ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బిజెపి సీనియర్ నాయకులు ఎండల లక్ష్మీనారాయణ, ఎస్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు డా కళ్యాణ్ నాయక్, సీనియర్ నేతలు గోలి మధుసూదన్ రెడ్డి,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవి నాయక్‌లు పాల్గొన్నారు.

## కాలిపర్స్‌తో సన్నాలు గుర్తింపు


### వెడల్పు, పొడవు కొలతలు కరెక్ట్ ఉంటేనే బోనస్

**హైదరాబాద్, నవంబరు 15, ప్రభాతవార్త:** ప్రస్తుత వానాకాలం మార్కెటింగ్ సీజన్ నుండి సన్న రకం ధాన్యానికి క్వింటాలుకు 500 రూపాయల బోనస్ ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అయితే ఈ సన్నాలను గుర్తించేందుకు ప్రత్యేక పరికరాలను కొనుగోలు చేస్తోంది. సన్న రకాల ధాన్యం పొడవు, వెడల్పు కొలతలను లెక్కించేందుకు గాను కాలిపర్స్ పరికరాలను వినియోగించనుంది. ఇవన్నీ కరెక్ట్‌గా ఉంటేనే బోనస్ రైతులకు ఇవ్వనున్నారు. అందుకు అవసరమైన కాలిపర్స్ పరికరాలను అధికారులు కొనుగోలు చేసి అందుబాటులోకి తెస్తున్నారు. ఈ వానాకాలం మార్కెటింగ్ సీజనులో రాష్ట్ర వ్యాప్తంగా 7,100 వరకూ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. ఈ లెక్కన రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 10 వేల వరకూ కాలిపర్స్ పరికాలు అవసరం అవుతాయని అంచనా. ఈ పరికరాలతో సన్న రకం ధాన్యం కొలతను లెక్కించి తద్వారా కొనుగోలు కేంద్రాల్లో వాటిని గుర్తించనున్నారు.

## అర్ధరాత్రి ఐటి కారిడార్‌లో రోడ్డు ప్రమాదం

### ఇద్దరు సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల మృతి


వెంకన్నస్వామి


దేవ్‌కుమార్

**హైదరాబాద్ (గచ్చిబౌలి), నవంబరు 15, ప్రభాతవార్త:** ఐటి కారిడార్‌లో అర్ధరాత్రి చోటు చేసుకున్న ఓ ప్రమాదంలో ఇద్దరు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు ప్రాణాలు విడిచారు. అతివేగం ఇద్దరు యువకుల ప్రాణాలను బలిగొంది. వేగంగా బైక్ మీద దూసుకువెళ్తున్న యువకులు బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. గచ్చిబౌలి ట్రిపుల్‌ఐటి చౌరస్తా వద్ద చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు పోలీసుల కథనం ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడకు చెందిన క్రిష్ణారావు కుమారుడు కేసాని వెంకన్నస్వామి(30) నగరానికి వచ్చి అమెజాన్ సంస్థలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. వైజాగ్ హరిజనబస్తీకి చెందిన కుమారస్వామి కుమారుడు పిల్లి దేవ్‌కుమార్‌స్వామి(25) మైక్రోసాఫ్ట్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. వీరు ఇరువురు నానక్‌రాంగూడలోని ఓ వర్కింగ్ హాస్టల్‌లో నివాసం ఉంటుండగా, ఇద్దరి మద్య స్నేహం ఏర్పడింది. గురువారం రాత్రి సెకండ్ షో సినిమాకు వెళ్లిన వీరు అర్ధరాత్రి 2 గంటల ప్రాంతంలో సినిమా వదిలిపెట్టిన తరువాత గచ్చిబౌలి నుంచి హోండా హారె న్జెట్ బైక్ మీద వీరు నానక్‌రాంగూడలోని తమ హాస్టల్‌కు బయలుదేరారు. ఈ క్రమంలో మితిమీరిన వేగంతో వెళ్తున్న వీరి వాహనం గచ్చిబౌలి ట్రిపుల్‌ఐటి వద్ద అదుపుతప్పి రోడ్డు మద్యలో ఉన్న డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వెంకన్నస్వామి, దేవ్‌కుమార్‌స్వామిలు బైక్ మీద నుంచి ఎగిరి కిందపడడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలికి చేరుకొని ఇద్దరు క్షతగాత్రులను కొండాపూర్ జిల్లా ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతిచెందినట్లు డాక్టర్లు ధృవీకరించారు. ఈమేరకు కేసు నమోదు చేసుకున్న గచ్చిబౌలి పోలీసులు వెంకన్నస్వామి, దేవ్‌కుమార్‌స్వామిల మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించారు. కాగా మితిమీరిన వేగంతో బైక్ నడుపడంతో బైక్ అదుపుతప్పి ప్రమాదం చోటుచేసుకుందని, బైక్ మీద ఉన్న వారు హెల్మెట్ ధరించకపోవడంతో తీవ్ర గాయాలతో మృతిచెందినట్లు పోలీసులు

# తెలంగాణ తరహా సంక్షేమ పాలన మహారాష్ట్రలో తెస్తాం

### మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

### షోలాపూర్‌లో మంత్రి ప్రచారానికి అపూర్వ స్పందన

### సుశీల్‌కుమార్ షిండేతో సమావేశమైన మంత్రి కోమటిరెడ్డి

**హైదరాబాద్, నవంబరు 15, ప్రభాతవార్త:** దేశంలో మతవిభజనతో అధికారంలోకి వచ్చిన బిజెపి ఇప్పుడు చివరకు అధికారం నిలబెట్టు కోవడానికి కుటుంబాలను విభజించే స్థాయికి దిగజారిందని తెలంగాణ రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి విమర్శించారు. శుక్రవారం మహారాష్ట్ర ఎన్నికలలో విస్తృతంగా ప్రచారం చేశారు. తెలంగాణ తరహాలో మహారాష్ట్రాలో సంక్షేమం, అభివృద్ధిని సమపాళ్ళలో జరిగేరీతిలో పాలన తీసుకొచ్చేందుకు మహావికాస్ అగాడి కూటమికి పెద్ద ఎత్తున ఓటు వేసి అధికారంలో ఉన్న బిజెపి కూటమికి డిపాజిట్లు రాకుండా చిత్తుచిత్తుగా ఓడించాలని మంత్రి కొమటిరెడ్డి వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. రెండురోజులుగా కొమటిరెడ్డి మహారాష్ట్ర ఎన్నికలలో ప్రచారం చేస్తున్నారు. శుక్రవారం షోలాపూర్‌లో మంత్రి కొమటిరెడ్డి వెంకటరెడ్డి వాకింగ్‌తో ప్రచారం మొదలు పెట్టి ప్రతి గడపకు వెళ్ళి ఓటరును కలుసుకున్నారు. మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, మాజీ కేంద్ర మంత్రి సుషీల్ కుమార్ షిండేతో సమావేశమయ్యారు.

రెండు రోజులుగా మహారాష్ట్రలోని షోలాపూర్ నియోజకవర్గంతో పాటు వివిధ నియోజకవర్గాల్లో ప్రచారం నిర్వహిస్తున్న మంత్రి తన ప్రచార అనుభవాలను సుషీల్ కుమార్ షిండేతో పంచుకున్నారు. ప్రచారం సరళి, ప్రజల నుంచి కాంగ్రెస్ పార్టీకి వస్తున్న ఆదరణ గురించి వివరించారు. తెలంగాణీయులు ఉండే కాలనీలకు వెళ్లగానే వారు అపూర్వ స్వాగతం పలికిన తీరు సంతోషం కలిగించిందని ఈ సందర్భంగా మంత్రి షిండేకు వివరించారు. తెలంగాణలో అమలవుతున్న పథకాలు మహారాష్ట్రలోనూ అమలు కావాలని ఇక్కడి ప్రజలు బలంగా కోరుకుంటున్నట్లు సుషీల్ కుమార్ షిండే దృష్టికి మంత్రి తీసుకువచ్చారు. కాంగ్రెస్ పార్టీ సంక్షేమానికి పట్టంకట్టే పార్టీ అని.. అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉండే నాయకులు ఒక్క కాంగ్రెస్ పార్టీ నాయకులేనని ప్రజలకు వివరించినట్లు ఆయన చెప్పారు. ప్రచారంలో ప్రజల స్పందన చూస్తుంటే కాంగ్రెస్ కూటమి బంపర్ మెజార్టీతో గెలవబోతుందనేది స్పష్టంగా కనిపిస్తుందని ఆయన తెలిపారు. తెలంగాణకు షోలాపూర్ కు విడదీయలేని బంధం ఉందని, అత్యధిక జనాభా తెలంగాణ ప్రాంతానికి చెందినవారేనని సుషీల్ కుమార్ షిండే ఈ సందర్భంగా చెప్పారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ కూటమి ఘన విజయం సాధిస్తుందని ఆయన ధీమావ్యక్తం చేశారు. ప్రచారంలో ఏ ప్రాంతాన్ని వదిలిపెట్టకుండా ప్రచారం నిర్వహిస్తూ పార్టీ గెలుపు కోసం శ్రమిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిని ఈ సందర్భంగా సుషిల్ కుమార్ షిండే అభినందించారు. మహారాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, షోలాపూర్ పార్లమెంట్ సభ్యురాలు ప్రణితి షిండేతో కలిసి మంత్రి వెంటకటరెడ్డి రెండు రోజులుగా ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు.

మహారాష్ట్ర ఎన్నికల్లో ఈసారి కాంగ్రెస్ పార్టీ కూటమి బంపర్ మెజార్టీతో గెలిచి అధికారం చేపట్టబోతుందని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి



కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆశాభావం వ్యక్తంచేశారు. కాంగ్రెస్ పార్టీ పట్ల మహా ప్రజల్లో ఆదరణ బాగుందని ముఖ్యంగా కేంద్ర,రాష్ట్రప్రభుత్వం అనుసరిస్తున్న విభజన రాజకీయాలను మహా ప్రజలు అసహ్యించుకుంటున్నారని ఆయన అన్నారు.

ఎక్కడికెళ్లినా కాంగ్రెస్సే కావాలని ప్రజలు ఎదురేగి స్వాగతం పలుకుతున్నారని ఆయన తెలిపారు. తెలంగాణకు చెందిన అనేక జిల్లాల నుంచి వచ్చిన చేనేత, యాదవ, కురుమ సోదరుల కాలనీలో ప్రజలను కలిసి కాంగ్రెస్ పాలన రావాల్సిన ఆవశ్యకతను వివరించారు.

## మహిళా స్వయం సహాయక సంఘాలకు సోలార్ విద్యుత్ ప్లాంట్లు

### మంత్రి సీతక్క

**హైదరాబాద్, నవంబరు 15, ప్రభాతవార్త:** మహిళా స్వయం సహాయక సంఘాలకు సోలార్ విద్యుత్ ప్లాంట్లు ఇవ్వనున్నట్లు మంత్రి సీతక్క తెలిపారు. శుక్రవారం మంత్రి సీతక్క మాట్లాడుతూ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఎస్‌హెచ్‌జిలకు వెయ్యి మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్లను కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరినట్లు మంత్రి తెలిపారు. మంత్రి సీతక్క ఆదేశాలతో ఇంధన కార్యదర్శికి పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి కార్యదర్శి లోకేష్ కుమార్ ప్రతిపాదనలు పంపించారు. మహిళా సంఘాలకు ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా వెయ్యి మెగా వాట్ల సోలార్ పవర్ ప్లాంట్‌లను కేటాయించాలని విజ్ఞప్తి చేశామన్నారు. మహిళా సంఘాలకు సోలార్ ప్లాంట్లు కేటాయిస్తే అనువైన భూములను గుర్తించి మహిళా సంఘాలకు గానీ, సమాఖ్యలకు లీజుకు భూములను ఇప్పిస్తామని వెల్లడించారు. మహిళా సంఘాలకు సోలార్ విద్యుత్ ప్లాంట్లను కేటాయించడం ద్వారా గ్రామీణ మహిళల ఆర్థిక అభ్యున్నతికి దోహద పడుతుందన్నారు. ఒక్కమెగా వాట్ ప్లాంట్‌కి మూడు కోట్ల వ్యయం కానుందన్నారు.

10 శాతం మహిళా సంఘాలు కాంట్రిబ్యూట్ చేస్తే 90 శాతం బ్యాంకు ద్వారా లోన్లు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. ఇంధన శాఖ అనుమతులిస్తే వారంలోపు సోలార్ విద్యుత్ ప్లాంట్ల ఇన్స్టాలేషన్ పూర్తి చేస్తామన్నారు. ఒక్క మెగా వాట్ ఉత్పత్తిపై యేడాదికి రూ.30 లక్షల ఆదాయం వస్తుందని అంచనా వేశారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ఇందిరా మహిళా శక్తి పథకాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. మంత్రి సీతక్క చొరవతో మహిళా సంఘాల కోసం 17 రకాల వ్యాపారాలు గుర్తింపు చేసినట్లు, ఇప్పటికే ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు యూనిఫాం కుట్టుపని, మహిళా శక్తి క్యాంటీన్లతో పాటు పలు రకాల వ్యాపారాల్లోకి మహిళా సంఘాలు వస్తున్నాయన్నారు. బ్యాంక్ లింకేజ్ ద్వారా వడ్డీలేని రుణాలు ఇస్తూ మహిళా సంఘాలను ప్రోత్సహిస్తున్నామని, త్వరలో మహిళా సంఘాలకు ఆర్టీసీ బస్సులు ఇవ్వనున్నట్లు తెలిపారు.

మహిళా సాధికారతకు పెద్ద పీట వేస్తున్న మంత్రి సీతక్క వెల్లడించారు. అందులో భాగంగా మహిళా సంఘాలకు సోలార్ ప్లాంట్లు కేటాయింపు చేసినట్లు తెలిపారు. ఇంధన శాఖ ఆమోదించిన అనంతరం పనులు మొదలు పెట్టనున్నట్లు తెలిపారు.

## విద్యుత్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ బృందం వాహనాలు

### జోన్లవారీగా మొత్తం 101..

### ఎస్పీడిసిఎల్ సిఎండి ముషారఫ్ ఫరూఖీ

**హైదరాబాద్, నవంబరు 15, ప్రభాతవార్త:** విద్యుత్ అత్యవసర పరిస్థితుల్లో సత్వరమే అందుబాటులో ఉండేలా దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (ఎస్పీడీసీఎల్) ప్రత్యేకంగా అత్యాధునిక ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీం వెహికల్స్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఈ మేరకు ఎస్పీడీసీఎల్ సిఎండి ముషారఫ్ ఫరూఖీ శుక్రవారం ఒక ప్రకటనలో వీటి విరాలను తెలియచేశారు. ఎక్కడైనా ఏ సమయంలోనైనా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడటం, ఏదైనా అత్యవసర పరిస్థితి ఎదురైనప్పుడు యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరణ పనులు చేపట్టేందుకు వీలుగా ఈ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీం వాహనాలు సిద్ధంగా ఉంటాయన్నారు. అంబులెన్స్ తరహాలో వీటిని వినియోగించనున్నారు. ఈ వాహనంలో షిఫ్ట్ విధానంలో ఒక అసిస్టెంట్ ఇంజనీరు, ముగ్గురు నైపుణ్యం కలిగిన సిబ్బంది ఈ టీంలో ఉంటారు. అలాగే ఎమెర్జన్సీ సమాచారానికి వాకీ టాకీ, థెర్మో విజన్ కెమారలతో పాటు, హెల్మెట్, ఎర్త్ రాడ్, గ్లౌజ్, సేఫ్టీ బెల్ట్, కండక్టర్, ఎల్‌టి, హెచ్‌టి కేబుల్, స్పానరల్ కిట్ తదితర అత్యాధునిక భద్రతా పరికరాలను ఈ వాహనంలో అందుబాటులో ఉంటాయని తెలిపారు. అంతేకాకుండా 100 కెవి సామర్థ్యం కలిగిన డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్‌ను సైతం తరలించేందుకు అనుకూలంగా ఈ వాహనం ఉంటుందని చెప్పారు. దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ పరిధిలో ప్రస్తుతం ఉన్న వాహనాలకు అదనంగా మెట్రో జోన్‌కు 50, రంగారెడ్డి జోన్‌కు 21, మేడ్చల్ జోన్‌కు 19, రూరల్ జోన్‌కు 11 చొప్పున మొత్తం 101 వాహనాలను కేటాయిస్తూ ఆదేశాలు జారీ చేయడం జరిగిందన్నారు. ఈ వాహనాలు డిసెంబరు 1వ తేదీ నుండి అందుబాటులోకి రానున్నాయనినసింఎడి ఫరూఖీ పేర్కొన్నారు.

## సింగరేణి స్థూల లాభం రూ.4 వేల కోట్లు

### సంస్థ సిఎండి బలరామ్

**హైదరాబాద్, నవంబరు 15, ప్రభాతవార్త:** ప్రస్తుత 2024-25 ఆర్థిక సంవత్సరం తొలి అర్ధ భాగానికిగాను సింగరేణి సంస్థ రూ.4 వేల కోట్ల మేర స్థూల లాభాన్ని ఆర్జించింది. గత ఏడాది ఇదే సమయానికి పోల్చి చూస్తే 36 శాతం వృద్ధితో రూ.1,072 కోట్లు అదనంగా వచ్చింది. ఈ మేరకు వీటి వివరాలను సింగరేణి సిఎండి ఎన్ బలరాం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్పత్తిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ లక్ష్యాల సాధన దిశగా దిశా నిర్దేశం చేస్తూ అన్ని శాఖలను సమాయుత్తం చేస్తున్నట్లు చెప్పారు. ఫలితంగా వార్షిక ఉత్పత్తి లక్ష్యం 720 లక్షల టన్నులను సాధించేందుకు కృషి జరుగుతుందని తెలిపారు. ఇప్పటి వరకూ బొగ్గు అమ్మకం ద్వారా రూ.17,151 కోట్లు, విద్యుత్‌పై రూ.2,286 కోట్ల టర్నోవర్ నమోదైందని వివరించారు. వర్షాకాలంలో రోజుకు లక్ష టన్నులకు బొగ్గు ఉత్పత్తి పడిపోగా, ఇప్పుడు 2..2 లక్షల టన్నులకు మళ్లీ పెరిగిందని వెల్లడించారు. కొత్తగూడెం ఏరియాలోలోని వీకే ఓసీ, ఇల్లందు ప్రాంతంలోని జేకే ఓసీలకు అటవీ అనుమతులు లభించడం వల్ల సంస్థ భవిష్యత్‌కు భరోసానిచ్చాయన్నారు. స్వయంగా గనులను తనఖీ చేస్తూ సంక్షేమంపై దృష్టిసారించడంతో మంచి ఫలితాలు వస్తున్నాయని పేర్కొన్నారు. సంస్థ తీసుకుంటున్న ఆర్థిక క్రమ శిక్షణ చర్యలు, నష్టాల పట్ల ఉద్యోగుల్లో అవగాహనా కార్యక్రమాలు చేపట్టడంతో మంచి ఫలితాలు వస్తున్నాయన్నారు. సింగరేణి వ్యాప్తంగా ఉజ్వల సింగరేణి, ఉద్యోగుల పాత్ర తదితర కార్యక్రమాలతో ఉత్పత్తి వ్యయం తగ్గించం, యంత్రాల వినియోగం పెంచేలా చర్యలు తీసుకుంటున్నామని తెలియచేవారు.



## ప్రతీ గింజనూ కొంటాం

### వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**హైదరాబాద్, నవంబరు 15, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల వద్ద గల ప్రతీ ధాన్యం గింజనూ కొనుగోలు చేస్తుందని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరావు స్పష్టం చేశారు. అంతేకాకుండా సకాలంలో కొనుగోలు చేసిన సొమ్మును రైతులకు చెల్లిస్తామని తేల్చిచెప్పారు. అయితే బిజెపి, బిఆర్ఎస్ పార్టీలు రైతులు ఇబ్బంది పడేలా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. హైదరాబాద్ సచివాలయంలో శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్ల విషయంలో రాష్ట్రంలోని రైతులు ఎలాంటి అపోహలు పడాల్సిన పని లేదన్నారు. సన్న రకం ధాన్యానికి బోనస్ ఇస్తుందని తెలిపారు. రైతులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా ధాన్యాన్ని సేకరిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇక వ్యాపారులు పోటీపడి మరీ కళ్లాల్లోనే ధాన్యం కొనుగోలు చేస్తున్నారన్నారు. ఇప్పటికే సన్న రకాలకు సంబంధించి క్వింటాలుకు 500 రూపాయల మేర బోనస్ చెల్లింపులు జరుగుతున్నాయని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం బోనస్ ప్రకటించడంతో రాష్ట్రంలో సన్న వరి రకాల సాగు భారీగా పెరిగిందని తెలియచేశారు. కాగా రాష్ట్రంలో ప్రస్తుత వానాకాలం మార్కెటింగ్‌కు సంబంధించి ధాన్యం కొనుగోలు నిమిత్తం 7,400 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు. ధాన్యం అమ్మకునేందుకు రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. దాదాపు రాష్ట్రంలోని ప్రతీ గ్రామంలోనూ ధాన్యం కొనుగోలు కేంద్రం ఉందని వెల్లడించారు. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా 9.58 టన్నుల ధాన్యం గొనుగోలు జరిగినట్లు వెల్లడించారు. ఓపెన్ మార్కెట్‌లో మద్దతు ధర కన్నా అధికంగా రేటు వస్తే అక్కడే అమ్ముకోవాలని సూచించారు. దేశంలో అతి ఎక్కువ ధాన్యాన్ని తెలంగాణలో పండిస్తున్నారన్నారు. రాష్ట్రంలోని గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లకు కూడా సన్న బియ్యం సరఫరా చేస్తామని చెప్పారు.

## శంషాబాద్‌లో 'వైష్ణోయ్' సౌత్‌వుడ్స్ ఆవిష్కరణ

### దక్షిణ హైదరాబాద్‌కు స్పెక్టాక్యులర్ ట్విస్ట్ ఇవ్వనున్న గ్రాండ్ విల్లా ప్రాజెక్ట్

### ప్రారంభ కార్యక్రమానికి 1,000 మందికిపైగా సందర్శకుల హాజరు

### 43.29 ఎకరాల్లో 260 ప్రత్యేక 4బిహెచ్‌కె, 5 బిహెచ్‌కె విల్లాలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, నవంబరు 15:** శంషాబాద్‌లోని మామిడిపల్లిలో ప్రత్యేక విల్లా కమ్యూనిటీ వైష్ణోయ్ సౌత్‌వుడ్స్‌ను ప్రారంభించినట్లు వైష్ణోయ్ గ్రూప్ సగర్వంగా ప్రకటించింది. ఈ గ్రాండ్ ఈవెంట్ 1,000 మందికిపైగా సందర్శకులను ఆకర్షించింది. మొదటి రోజులోనే 50 కంటే ఎక్కువ బుకింగ్‌లు వచ్చాయి, ఇది ప్రాజెక్ట్ ఆకర్షణకు, వైష్ణోయ్ గ్రూప్ తిరుగులేని వారసత్వానికి బలమైన సాక్ష్యంగా నిలిచింది. వైష్ణోయ్ సౌత్‌వుడ్స్ ప్రారంభించిన సందర్భంగా, వైష్ణోయ్ గ్రూప్ వ్యవస్థాపకులు, సిఎండి యెలిశాల రవి ప్రసాద్ మాట్లాడుతూ, మా విజన్ ఆఫ్ స్పెక్టాక్యులర్ లివింగ్ - విశాలమైన ప్రదేశాలతో ఉత్కంఠభరిత సౌందర్యాన్ని మిళితం చేయడం అనేది దక్షిణ హైదరాబాద్ రియల్ ఎస్టేట్ ల్యాండ్‌స్కేప్‌ను మార్చడాన్ని లక్ష్యంగా పెట్టుకుంది. మార్గదర్శక స్ఫూర్తితో ఇళ్లను సృష్టించడం, కమ్యూనిటీలను పెంపొందించడంలో తిరుగులేని నిబద్ధతతో మేం నాణ్యత, విశ్వాసం కోసం కొత్త ప్రమాణాలను ఏర్పరుస్తూనే ఉన్నామని అన్నారు. సౌత్‌వుడ్స్ అనేది 260 అల్ట్రా విలాసవంతమైన విల్లాలను అందించే ప్రీమియం గేటెడ్ కమ్యూనిటీ. విశాలమైన ఆకుపచ్చ ప్రదేశాలతో ఆధునిక సౌకర్యాలను మిళితం చేయడానికి ఆలోచనాత్మకంగా రూపొందించబడింది. 43.29 ఎకరాల మధ్య ఏర్పాటు చేయబడిన ఈ కమ్యూనిటీ ఇక్కడి నివాసితులకు 300 నుండి 550 చదరపు గజాల వరకు విల్లా పరిమాణాలతో ఉన్నతమైన జీవన అనుభవాన్ని అందిస్తుంది.

ప్రతి విల్లాలో మినీ థియేటర్ గది, విశాలమైన నివాస స్థలాలు, గోల్ఫ్ టర్ఫ్, సెంట్రల్ పార్క్, ప్రశాంతమైన వర్క్ స్టేషన్‌లతో పాటుగా ప్రత్యేకమైన స్కై బ్రిడ్ తో సహా 50 కంటే ఎక్కువ ప్రపంచస్థాయి సౌకర్యాలకు యాక్సెస్ వంటి ప్రత్యేక సదుపాయాలు ఉంటాయి. వ్యూహాత్మకంగా శంషా బాద్‌లో నెలకొన్న సౌత్‌వుడ్స్ రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్, హైటెక్సిటీ, ప్రముఖ విద్యాసంస్థలకు చేరువలో ఉంటుంది.

వైష్ణోయ్ గ్రూప్ మునుపటి ప్రాజెక్ట్, ఆర్చర్డ్స్,2023లో పూర్తయింది. అది తన కొనుగోలుదారులకు పెట్టుబడిపై ఆకట్టుకునే 100 శాతం రాబడిని అందించింది. అది వైష్ణోయ్ సౌత్‌వుడ్స్ సమీపంలోని మామిడిపల్లిలో వ్యూహాత్మక ప్రాంతంలో నెలకొంది. ఈ వ్యూహాత్మక లొకేషన్ అనేది నివాసితులు, ఇన్వెస్టర్లకు ఆకర్షణీయమైన ఎంపికగా మారింది.

డిసెంబర్ 2027లో స్వాధీనం చేసుకునే అవకాశంతో, వైష్ణోయ్ సౌత్‌వుడ్స్ ఈ అసాధారణమైన కమ్యూనిటీని అన్వేషించడానికి ప్రత్యేకమైన పెట్టుబడి అవకాశాన్ని, విలాసవంతమైన జీవనశైలిని కోరుకునే వారిని ఆహ్వానిస్తోంది. వైష్ణోయ్ గ్రూప్ సీఎండీ వై.రవి ప్రసాద్,డైరెక్టర్లు ఎ.కృష్ణా రెడ్డి, వై.శరత్ చంద్ర, వై. హేమ చంద్ర మార్గదర్శకత్వంలో, 25+ విజయవంతమైన ప్రాజెక్ట్‌లతో 35 సంవత్సరాలకు పైగా వారసత్వాన్ని కలిగిఉంది.



## నేటి నుంచి డెడికేటెడ్ కమిషన్ జిల్లాల్లో బహిరంగ విచారణ

### నేడు నల్గొండ, రేపు ఖమ్మంలో కొనసాగింపు

### 18న మహబూబ్‌నగర్‌లో పర్యటన

**హైదరాబాద్, నవంబరు 15, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన డెడికేటెడ్ కమిషన్ జిల్లాల్లో పర్యటించనుంది. బీసీ రిజర్వేషన్లపై నిర్ణయం తీసుకోవడం కోసం ఏర్పాటు చేసిన డెడికేటెడ్ కమిషన్ నేడు(శనివారం) నల్గొండ జిల్లాలో బహిరంగ విచారణను నిర్వహించనుంది. బహిరంగ విచారణలో ఉమ్మడి నల్గొండ జిల్లా ప్రజల నుంచి వినతులు స్వీకరించనుంది. రేపు(ఆదివారం) ఖమ్మం జిల్లాలో.. ఈ నెల 18న మహబూబ్‌నగర్ జిల్లాలో బహిరంగ విచారణను నిర్వహించనుంది. ఇప్పటికే రెండు రోజులపాటు హైదరాబాద్‌లో బహిరంగ విచారణను నిర్వహించిన డెడికేటెడ్ కమిషన్ ఈ నెల 13న రంగారెడ్డి జిల్లాలో విచారణను నిర్వహించింది. ఇప్పుడు మరో మూడు జిల్లాల్లో నిర్వహించనుంది. ఈ నెల 30లోపుగా బీసీ రిజర్వేషన్లపై తమ నివేదికను ఇవ్వడం కోసం కమిషన్ చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగా 10 ఉమ్మడి జిల్లాల్లో బహిరంగ విచారణను నిర్వహించి.. అనంతరం వివిధ ప్రభుత్వ శాఖల అధిపతులతో సమావేశం కానుంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 30లోపుగా నివేదికను ఇవ్వడానికి అన్ని ప్రయత్నాలు చేస్తున్నట్టు తెలుస్తోంది.

## ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టుల ఖిల్లాలో కొత్త బేస్ క్యాంప్‌ల ఏర్పాటు

### నక్సల్స్‌పై ముప్పేట దాడికి కేంద్రం సన్నాహాలు

**హైదరాబాద్, నవంబరు 15, ప్రభాతవార్త:** ఛత్తీస్‌గఢ్‌లోని మావోయిస్టుల ఖిల్లా అబూజ్ మడ్‌కు అత్యంత సమీపంలో గల రెండు ప్రాంతాలలో కొత్తగా పారా మిలట రీ బేస్ క్యాంప్‌ల ఏర్పాటుతో నక్సలైట్లపై ముప్పేట దాడికి కేంద్రం పూర్తిస్థాయిలో సన్నాహాలు చేబట్టిందని వార్తలు వస్తున్నాయి. ఇటీవల కాలంలో ఛత్తీస్ఘడ్‌లో జరి గిన నలు ఎన్‌కౌంటర్‌లో పదుల సంఖ్యలో మావోయిస్టులు మరణించడం తెలిసిందే.

ఇదే సమయంలో పెద్ద ఎత్తున ఆయుధాలు, మందు గుండు సామాగ్రిని పోలీసు లు జప్తు చేయడం విదితమే. అయినప్పటికీ అబూజ్ మడ్‌లోని కొన్ని కీలక ప్రాంతాలలో పోలీసులు ఇప్పటికీ ప్రవేశించలేక పోవడం భద్రతా బలగాలకు వెలితిగానే వుం దని నిఘా వర్గాలు అంచనాకు వచ్చాయి.

ఈ నేపథ్యంలోనే అబూజ్‌మడ్‌కు అత్యంత సమీపంలో గల దుబ్బకొంట, నంబి ప్రాంతాలలో రెండు బేస్ క్యాంప్‌ల ఏర్పాటు కు కేంద్రం నిర్ణయం తీసుకుంది. ఇందుకు సంబంధించిన పనులు వేగంగా సాగుతున్నాయి. ఇప్పటికే వందల సంఖ్యలో సిఆర్‌పిఎఫ్ బలగాలు ఆయుధాలు, మందు గు ండు సామాగ్రితో అక్కడికి చేరుకున్నారు. ఇందులో దుబ్బకొంట సుక్మ జిల్లాలోని చింతగుప్ప పోలీసు స్టేషన్ పరిధిలో ఉండగా నంబి బిజాపూర్ జిల్లా ఉసూర్ పోలీసు స్టేషన్ పరిధిలో వుంది. ఈ రెండు ప్రాంతాలో మావోయిస్టుల ఖిల్లా అబూజ్‌మడ్‌కు అత్యంత సమీపంలో వున్నాయి.

వాస్తవానికి ఛత్తీస్‌గఢ్‌లో ప్రస్తుతం 31 సాధారణ సిఆర్‌పిఎఫ్ బెటాలియన్లతో పాటు మరో బస్తర్ బెటాలియన్, ఆరు కోబ్రా బెటాలియన్ల సిబ్బంది మావోయిస్టుల ఏరివేతలో పాలుపంచుకుం టున్నారు.

సమారు 38 వేల మంది పారా మిలటరీ బలగాలు ఈ రాష్ట్రంలో మావోయిస్టుల ఏరివేతలో వున్నారు. వీరితో పాటు ఛత్తీస్‌గఢ్‌లోని రిజర్వ్ పోలీసులు మరో పది వేల మం ది సిఆర్‌పిఎఫ్ పోలీసులకు సహాయకులుగా వున్నారు. వీరికి తోడుగా స్థానిక పోలీసులు కూడా వున్నారు. ఈ లెక్కన 50 వేల మంది వరకు పోలీసు బలగాలు మా వోయిస్టుల ఏరివేతలో ఉన్నారు.

